ప్రజాశక్తి

సోమవారం 12 మే 2025 | 5 | విజయనగరం

గరివిడిలో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు మూడోరోజు ఆదివారం రసవత్తరంగా సాగాయి. కొత్త పరిమళం, దేవరాగం, చీకటి పువ్వు వంటి నాటికలను ప్రదర్శించారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రేక్షకులు హాజరయ్యారు. అనంతరం కళాకారులకు బహుమతులు అందజేశారు. - ప్రజాశక్తి, చీపురుపల్లి

నిధులివ్వకుండా అభివృద్ధి ఎలా?

నేడు డిఆర్‌సి సమావేశం

ఏం చర్చిస్తారో? ప్రభుత్వానికి ఏం నివేదిస్తారో?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా జిల్లా అభివృద్ధికి చిల్లిగవ్వ కూడా కేటాయించలేదు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరిట కేటాయించిన అరకొర నిధులు ఏ మూలకూ సరిపోయే పరిస్థితి లేదు. స్వర్ణాంధ్ర విజన్ తప్ప, కొత్త పరిశ్రమలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు అంటూ జిల్లాలో ఏమీ కనిపించడం లేదు. రహదారులు, రైల్వే లైన్లు, ఎయిర్‌పోర్టు వంటివాటి కోసం వందల ఎకరాల భూములు సేకరిస్తున్నారు. బహుశా వాటినే అభివృద్ధిగా చూపిస్తారేమో. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన జిల్లా అభివృద్ధి మండలి (డిఆర్‌సి) సమావేశం సోమవారం మధ్యాహ్నం జరగబోతోంది. ఇందులో ఏం చర్చిస్తారో? ప్రభుత్వానికి ఏం నివేదిస్తారో వేచిచూడాల్సిందే.

గతంలో డిఆర్‌సి సమావేశం అంటే... జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ముందస్తు సమీక్షలు జరిగేవి. ఆయా ప్రాజెక్టులు, పనులు, అమలు తీరు, ప్రతిపాదించాల్సిన అజెండాలపై చర్చోపచర్చలు జరిగేవి. అధికార యంత్రాంగం కూడా అందుకు తగ్గట్టు సన్నద్ధమయ్యేవారు. కానీ, నేడా పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకు కారణం లేకపోలేదని కూడా పలువురు చర్చించుకుంటున్నారు. గడిచిన ఏడాదిలో విజన్ - స్వర్ణాంధ్ర, ప్లానింగ్, ప్రతిపాదనలు, ఆ పేరుతో ఇటీవల కొన్ని శంకుస్థాపనలు తప్ప చెప్పుకోదగ్గవేమీ లేవనే వాదన వినిపిస్తోంది. జిల్లా అభివృద్ధి అనేసరికి సాధారణంగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలు గుర్తుకు వస్తాయి. వీటిలో ప్రధానమైనది వ్యవసాయ రంగం. ఈ రంగం అభివృద్ధి చెందాలంటే సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలి. కానీ, జిల్లాలో అత్యంత కీలకమైన రామతీర్థసాగర్ కోసం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.807.55 కోట్లు అవసరం కానున్నట్టు అధికారులు ప్రతిపాదనలు రూపొందించగా, కేవలం రూ.68కోట్లు మాత్రమే ఇటీవల బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించింది. ఇటీవల ఈ ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి కూడా నిధుల పెంపు విషయంలో హామీ ఇవ్వలేదు. ఈనేపథ్యంలో నెల్లిమర్ల నియోజకవర్గంలోని 24వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరానికి తాగునీటి వసతి ఇప్పట్లో కల్పించే పరిస్థితులు కనిపించలేదు. మరి భోగాపురం ఎయిర్‌పోర్టు ఏడాదిలో ఎలా పూర్తిచేస్తారో? ప్రారంభించాక దానికి నీరు ఎలా అందుతుందో జిల్లాకు చెందిన అమాత్యులు, ప్రభుత్వ పెద్దలకే ఎరుక. తోటపల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులు, భూసేకరణ, నష్టపరిహారం కోసం ఈ ఏడాది రూ.519.11 కోట్లు కేటాయించాలని ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపగా, ఆచరణలో ప్రభుత్వం రూ.47.81కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులు ఏమూలకూ సరిపోని పరిస్థితి. ఇక చిన్నచితక జలాశయాలకు కేటాయించింది కొసరంతే. ఇక పారిశ్రామిక రంగం విషయానికి వస్తే ఎంఎస్ఎంఇ పరిశ్రమల పేరిట భూముల కేటాయింపులు, శంకుస్థాపనలు జరుగుతున్నాయి. సేవారంగంలోనూ మద్యం దుకాణాలు పెంపు తప్ప చెప్పుకోదగ్గ అభివృద్ధి కనిపించడం లేదు. ఇక సమస్యల విషయానికి వస్తే మెటీరియల్ కాంపొనెంట్ నిధులను సద్వినియోగం చేసుకోక పోవడం కోట్లాది రూపాయలు నిధులు వెనక్కి పోయాయి. ఉపయోగించుకున్న పనులకు ఇప్పటికీ బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్లు లబోదిబో మంటున్నారు. జనవరి 15వ తేదీ నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా అల్లాడిపోతున్నారు. ఇటీవల మంజూరు చేసిన బిసి కార్పొరేషన్ రుణాలన్నీ ఎమ్మెల్యేల అనుయాయులకే వెళ్లిపోయాయని తమను పట్టించుకోలేదని సాక్షాత్తు తెలుగు తమ్ముళ్లే ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జరగబోయే సమావేశంలో అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలైనా వినిపిస్తాయా? సమీక్షలో ఎలాంటి లోపాలను గుర్తిస్తారు? అన్నదానిపై ఆద్యంతం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత రాక

జిల్లా సమీక్ష సమావేశం రాష్ట్ర హోంశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుంది. జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్ సేతుమాధవన్ తెలిపారు. జిల్లాకు సంబంధించిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష చేస్తారని పేర్కొన్నారు.

వైఎస్ఆర్ కాలనీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజల భద్రతకు 'కార్డన్ సెర్చ్'

ప్రజాశక్తి-విజయనగరంకోట

దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రజల రక్షణ, భద్రత, నేరాలు, అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ ఆదేశాలతో 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ లో భాగంగా 2వ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో వైఎస్ఆర్ నగర్‌ను పోలీసులు జల్లెడ పట్టారు. రోజురోజుకూ విజయనగరం విస్తరించడం, ఇతర ప్రాంతాల నుండి బతుకు తెరువు కోసం కొత్త వ్యక్తులు వచ్చి, నగర శివార్లలో నివాసం ఏర్పాటు చేసుకోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జరిగేందుకు అవకాశం ఉండడంతోఅనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసేందుకు డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ చేపట్టారు. 12మంది సిఐలు, 32మంది ఎస్ఐలతో సహా, 400మంది పోలీసు సిబ్బందితో వైఎస్ఆర్ నగర్‌లోని 3070 ఇళ్లను 14 బ్లాకులుగా విభజించి సోదాలు నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల వివరాలు సేకరించి, వారి వేలి ముద్రలను ఎంఎస్‌సిడి పరికరాలతో తనిఖీలు చేశారు. వారి వద్ద లభించిన వాహనాల రికార్డులను పరిశీలించి, రికార్డులు సక్రమంగాలేని 75 ద్విచక్ర వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం 2వ పట్టణ పోలీసు స్టేషనుకు తరలించారు. అనుమానిత వ్యక్తులు పారిపోయేందుకు అవకాశం ఉన్న మార్గాలను ముందుగా గుర్తించి, ఆయా మార్గాలను పోలీసు బృందాలతో ముందుగానే దిగ్బంధనం చేశారు. ప్రజల రక్షణ, భద్రతకు భరోసా కల్పించాలనే లక్ష్యంతోనే 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ చేపట్టినట్లు ఎస్‌పి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో అనుమానస్పదంగా షెల్టరు తీసుకున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని నుండి 25 మొబైల్ ఫోన్లు, 3 లీటర్ల మద్యం స్వాధీనంచేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో సిఐలు టి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాస్, సిహెచ్ సూరినాయుడు, కె.దుర్గాప్రసాద్, జి.రామకృష్ణ, బి.శ్రీనివాసరావు, ఎల్. అప్పలనాయుడు, సిహెచ్. షణ్ముఖరావు, వి.నారాయణ మూర్తి, బి.లలిత, 32మంది ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఎస్టీఎఫ్, బాంబ్, డాగ్ స్క్వాడ్, డ్రోన్ బృందాలు పాల్గొన్నాయి.

నగరంలో ఆకస్మిక తనిఖీలు

నగరంలోని రైల్వేస్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. డిఎస్‌పి ఆదేశాలతో వన్ టౌన్ సి.ఐ.ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.

పద్మవ్యూహం

నాలుగురోడ్ల జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు

తరచూ ప్రమాదాలు

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

గజపతినగరం మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ గందరగోళంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఓవైపు జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలు..మరోవైపు పురిటిపెంట మీదుగా మెంటాడవైపు వెళ్లే రహదారి.. ఇంకోవైపు తూర్పు ప్రాంత గ్రామాలకు వెళ్లే రహదారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. తరచూ ఈ జంక్షన్‌లో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

నిత్యం రద్దీగా ఉన్న గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్

గజపతినగరం పట్టణం రోజురోజుకూ అభివృద్ధి అవుతున్నా అందుకు తగ్గ మౌలిక వసతులు మాత్రం కనిపించడం లేదు. నాలుగు రోడ్ల జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేకపోవడం, కనీసం పోలీసు బీట్ కూడా ఇక్కడ లేకపోవడంతో వాహనాలు క్షణం కూడా ఆగి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. గత కొంతకాలంగా ట్రాఫిక్ సమస్యలు విపరీతంగా పెరుగుతున్నాయి. పట్టణంలో ప్రధానంగా మెంటాడ రోడ్డు, గణేష్ టెంపుల్ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడంతో వాహనాలు నిలిచి జాతీయ రహదారిపై పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. గత నెలలో లారీ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో లక్ష్మణరావు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈనేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కార దిశగా చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో బస్ షెల్టర్ లేకపోవడం, సర్వీస్ బస్సులు, సిటీ బస్సులు ప్రయాణికులను రోడ్డుపై ఎక్కించడం, దించడం జరగుతున్నాయి. కొన్నిసార్లు, బస్సులు వాటి మధ్య పోటీ కారణంగా రోడ్డు మధ్యలో ఆగిపోతున్నాయి. ఇది ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోంది. ఆటో స్టాండ్ లేకపోవడం వల్ల ఆటో వాహనదారులు రోడ్డుపై నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతోంది. స్పీడు బ్రేకర్లు గాని, నాలుగురోడ్ల జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ గాని లేకపోవడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

త్వరలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం

ట్రాఫిక్ సమస్యపై ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడును ప్రజాశక్తి వివరణ కోరగా, నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ప్రతిరోజూ తమ సిబ్బంది, మొబైల్ వెహికల్ సిబ్బంది ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వీలైతే బస్ షెటర్ కూడా ఏర్పాటు చేసే విధంగా చూస్తామని చెప్పారు.

అభివృద్ధికి నోచని శివారు ప్రాంతాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రం నగర పాలక సంస్థ స్థాయికి ఎదిగినా పలు కాలనీలు, శివారు ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. కాలువ వ్యవస్థ నేటికీ అస్తవ్యస్తంగా ఉంది. శివారు కాలనీల్లో కాలువలు లేక మురికి నీరు రోడ్డు మీద ప్రవహిస్తోంది. అక్కడక్కడా కాలువలు ఉన్నా వాటిని శుభ్రం చేసే సిబ్బంది సరిపడా లేకపోవడంతో దోమలతో ప్రజలు సావాసం చేస్తున్నారు. ఓవైపు అధ్వాన కాలువల తో దుర్వాసన, మరోవైపు తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో మురుగు పారుదలకు మార్గం లేక కాలనీల్లోని ఖాళీ స్థలాల్లోకి మురుగు చేరుతోంది. అనేక ఏళ్లుగా శివారు ప్రాంతాలపై పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. శివారు ప్రాంతాల్లో ఉన్న కార్పొరేటర్లు మొన్నటి వరకు అప్పటి ఎమ్మెల్యే కోలగట్ల ఆధ్వర్యాన చేపట్టిన పనులు తప్ప ఆ తరువాత కాలువలు, తాగునీటి సమస్య పరిష్కారానికి ఏ విధమైనా కృషీ లేదు. నగర పాలక సంస్థ సాధారణ, వివిధ గ్రాంట్ల నిధులతో నిర్మించిన వాటిలో ప్రాధాన్య క్రమం పాటించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో కాలువ వ్యవస్థ లేదనీ స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. సైడు కాలువలు లేకపోవడతో పలువురు భవన నిర్మాణదారులు కచ్చాకాలువలు తీసి వదిలేశారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. మురుగు నీరు నిలిచి దోమలు, పందుల బెడద ఎక్కువైందని ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా నగరంలో సిద్ధివినాయక నగర్, హాజీఅలీ నగర్, మంగళవీధి, బాబామెట్ట ఎంఐజి, ఎన్‌ఐజి కాలనీలు, సిఆర్ నగర్ కాలనీ, దాసన్నపేట, అశోక్ నగర్, కొత్తపేట, లంకాపట్నం, కామాక్షినగర్, మహాలక్ష్మినగర్, ఉడా కాలనీ, గాజుల రేగ, అలకనంద కాలనీ, తోటపాలెం వైఎస్ఆర్ కాలనీ, కొత్తఅగ్రహారం, ఇంద్రాణీ నగర్, పద్మావతి నగర్, ధర్మపురి, కనపాక, కెఎల్ పురం, జొన్నగుడ్డి, విమలానగర్, సూర్యానగర్, అగ్రహారం, తదితర కాలనీల్లో రోడ్లు నిర్మించి కాలువలను

కెఎల్‌పురంలో కాలువలు లేకపోవడంతో మురుగు దుస్థితి

కోరుకొండ పాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

మాతృభూమి సేవా సంఘం , విజయనగరం గ్రామీణ వైద్యుల సంఘం వెంకటరామా ఆస్పత్రి వైష్ణవ్ ఐ సెంటర్ ఆధ్వర్యంలో కోరుకొండపాలెంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి 28మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. గ్రామ సర్పంచ్ బోనికృష్ణ మాట్లాడుతూ తమ గ్రామంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న మాతృభూమి సేవా సంఘం సభ్యులకు, గ్రామ యువతకు అభినందనలు తెలిపారు. మరణించిన వ్యక్తుల కళ్లను దానం చేయడంపై అవగాహన ఉండాలన్నారు. మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఐ గోపాలరావు మాట్లాడుతూ డాక్టర్ చిట్టి రమణారావు తన కుమారుడి పేరు మీద కంటి ఆసుపత్రి పెట్టి గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు సేవ చేసేందుకు ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సిరిపురపు శంకరరావు, ధన లక్ష్మణ్, రెడ్డి సత్యారావు, ఈశ్వరావు, గ్రామీణ వైద్యులు బండారు నారాయణమూర్తి పాల్గున్నారు

కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సంతకవిటి

కార్మికుల హక్కుల రక్షణకై నాలుగు లేబర్ కోడ్లు రద్దుకై దేశవ్యాప్తంగా మే 20న జరుగు సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం సంతకవిటిలోని జీపు జాతలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్ చట్టాలతో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. 44 కార్మిక చట్టాలు రద్దు చేసి 4 లేబర్ కోడ్లు ను అమలు చేయడం దుర్మార్గమన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఆటో, హమాలీ, బిల్డింగ్ వంటి అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేసి న్యాయం చేయాలన్నారు. అంగన్వాడి, ఆశా, మిడ్డేమిల్, విఒఎ, ఆర్‌పి, శానిటేషన్ వర్కర్స్ అందర్నీ పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రవేటీకరణ అపాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాలకూ చెందిన కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు కె.అసిరప్పుడు, ఎ,సురేష్, గాయత్రి, రాములమ్మ, ఉషారాణి, అప్పమ్మ, చిన్నారావు, మహేష్, అన్నారావు, శంకర్రావు, సన్యాసిరావు, ఎల్.శివాజీ, రామప్పుడు, కృష్ణారావు, అప్పన్న, కోటి, హరి తదితరులు పాల్గొన్నారు.

జీపుజాతాలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

బొబ్బిలి: సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో పట్టణ కళాసి సంఘం, ఐఎఫ్‌టియు, సిఐటియు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పట్టణ కళాసి సంఘం కార్యదర్శి ఎ.అప్పారావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు మే 20 సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొంటారని తెలిపారు. ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు మెరుగని గోపాలం మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే కార్పొరేటర్ శక్తులకు లాభం చేకూర్చే 4లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు జరపవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు మాట్లాడుతూ మే 20న వేణుగోపాలస్వామి కోవెల సెంటర్ నుండి ఉదయం 9 గంటలకు జరిగే ప్రదర్శనలో కార్మికులు ఉద్యోగులు ఉపాధ్యాయులు పాల్గొని ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు నాయకులు పిల్ల లక్ష్మణరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలు తదితరులు పాల్గొన్నారు.

జల వనరుల పనులకు ప్రాధాన్యత

- మొదటి మూడు నెలల్లో 1.33కోట్ల పనిదినాల కల్పన
- జులై తరువాత ఉద్యాన పంటలు, పశుగ్రాసం, ప్లాంటేషన్
- వేతన దారులకు సరికొత్త బీమా పథకాలు
- ప్రజాశక్తితో డ్వామా పీడీ శారదాదేవి ముఖాముఖి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో జలవనరుల అభివద్ధికి తొలి ప్రాధాన్యతనిస్తున్నామని డ్వామా పీడీ శారదా దేవి తెలిపారు. ఈ ఏడాది మొదటి త్రై మాసిక పనులలో చెరువులు, కాలువలు మరమ్మతులు, పూడిక తీతలు చేపడుతున్నామని వివరించారు. పని ప్రదేశాల్లో నీడ, నీరు సదుపాయం కూడా కల్పిస్తున్నామని తెలిపారు. పని ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు లేదా సాధారణంగా మరణించినవారు లేదా గాయపడినవారికి ప్రభుత్వం బీమా సదుపాయం కూడా కల్పించిందని తెలిపారు. రోజుకు రూ.307 వేతనం అందేవిధంగా తమ సిబ్బంది వేతనదారులకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రెండు పూటలా పని పెడుతున్నామని వివరించారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి పీడీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే....

పని కల్పన ఎలా ఉంటోంది?

ఈ ఏడాది తప్పకుండా ప్రతి జాబ్‌కార్డుపైనా 100రోజులు పని కల్పించే విధంగా ప్రణాళిక రూపొందించుకున్నాం. ఇప్పటికే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొదటి మూడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 1.33కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు అంటే గడిచిన 40రోజుల్లో 37.73లక్షల పనిదినాలు కల్పించాం.

ఈ ఏడాది ప్రాధాన్యతలేమిటి?

ఈ ఏడాది ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి మూడు నెలల్లో సాగునీటి చెరువులు, కాలువలు, నీటి కుంటల తవ్వకాలకు ప్రాధాన్యతనిస్తున్నాం. పశువులు ఎక్కడికక్కడ దాహార్తిని తీర్చుకునేందుకు వీలుగా నీటి తొట్టెల నిర్మాణం కూడా చేపడుతున్నాం. దాదాపు జూన్ వరకు ఇటువంటి పనులకు ప్రాధాన్యత ఉంటుంది.

జులై తరువాత ప్రాధాన్యతలు మారుతాయా?

అవును...! జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో ఉద్యాన పంటలు, పశు గ్రాసం, ప్లాంటేషన్ పనులకు ప్రాధాన్యతనిస్తాం. ప్లాంటేషన్‌లోనూ పనస కర్రను వీణల తయారీకి అవసరమైన పనస చెట్ల పెంపకాన్ని ఎక్కువగా ప్రోత్సహిస్తాం. అక్టోబర్ నుండి 2026 మార్చి వరకు సిసి రోడ్లు, బిటి రోడ్లు, ఇతర పనులు చేపడతాం.

బీమా సదుపాయం గురించి వివరిస్తారా?

ఉపాధి వేతన శ్రామికులు దురదష్టవశాత్తు మరణించినా, ప్రమాదం కారణంగా వైకల్యం సంభవించిన బీమా రక్షణ అందించే రెండు పథకాలు అమలులో ఉన్నాయి. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వేతనదారులు రూ.20 ప్రీమియం ప్రతి సంవత్సరం చెల్లించాల్సివుంటుంది. ఈపథకం కింద ప్రమాద వశాత్తు మరణించినా, లేదా పూర్తి వైకల్యం కలిగిన వారికి రూ.2లక్షలు ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. పాక్షికంగా వైకల్యం పొందిన వారికి రూ.లక్ష పొందగలుగుతారు.

పిఎం జీవన జ్యోతి పథకం ఎలా ఉండబోతుంది?

ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయసు వారు రూ.436 ప్రీమియం ప్రతి ఏడాది చెల్లించాల్సి ఉంటుంది, ఏ కారణంగా మరణించినా, వారి వారసులకు రూ.2లక్షల పరిహారం అందుతుంది. ఈ బీమా సదుపాయం పొందాలనుకునేవారు పోస్ట్ ఆఫీస్ లేదా బాంక్‌లోని ఖాతాకు నెంబర్‌కు ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలి. పూర్తి వివరాలకు 9849903737 నెంబర్‌కు సంప్రదించవచ్చు.

చాలా మంది శ్రమకు తగ్గవేతనం రావడం లేదంటున్నారు? వారికి మీరిచ్చే సమాధానం ఏమిటి?

ప్రభుత్వ లెక్కలు ప్రకారం పనిచేసినవారికి తప్పకుండా రూ.307 వరకు వస్తుంది. ఇందులో సందేహం లేదు. చేసే పనిని బట్టి కొన్ని నిర్ధిష్టమైన కొలతలు ఉంటాయి. వాటికి అనుగుణంగా పనిచేస్తే పూర్తిస్థాయి వేతనం పొందేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకనుగుణంగా వేతనదారుల్లో అవగాహన పెంచే విధంగా కొలతులు వేసి చూపించేందుకు కూడా ప్రయత్నిస్తున్నాం.

పని గంటలేమైనా నిర్ధేశించారా?

వేసవి నేపథ్యంలో ఎండవేడి నుంచి తప్పించేందుకు ఉదయం 5.30 గంటల నుండి 10.30 వరకు, సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల మధ్య పనిచేయాలని చూచిస్తున్నాం. ఈమేరకు వేతనదారులకు మేట్స్, ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి సూచనలు అందిస్తున్నాం. ఆయా సమయాల్లో మాత్రమే అటెండెన్స్ వేయాల్సివుంటుందని కూడా ఆదేశాలు జారీచేశాం.

నేటి నుంచి దారగంగమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

శృంగవరపుకోట గ్రామ దేవత దార గంగమ్మ తల్లి చిన్న పండగను నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు అగ్గిహోత్రుల రాజగోపాలాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి పసుపు నీళ్లతో జలాభిషేకం నిర్వహిస్తారని, అనంతరం భక్తులకు అమ్మవారి నిజరూప దర్శన భాగ్యం కల్పిస్తారని, మంగళవారం సౌభాగ్య పండగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సతివాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగుతున్నందున సోమవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ప్రకటనలో తెలిపారు. సతివాడ 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో రామతీర్థం 11కెవి రూరల్ ఫీడర్, ఒమ్మి11కెవి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ నిర్మాణ పనుల కొనసాగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం మరుపాడ, పినతరిమి,పెద తరిమి, బొప్పడాం, వల్లూరు, బొద్దపేట, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముగిసిన నూకాలమ్మతల్లి ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో మూడురోజుల పాటు నిర్మించిన నూకాలమ్మతల్లి ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మూడో రోజు వేదపండితులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామ పురోహితులు భమిడిమర్రి శ్రీనివాసరావుశర్మ ఆధ్వర్యంలో ఈ మూడు రోజులు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్న దానం చేశారు. ఈ ఉత్సవాలకు యూట్యూబ్ స్టార్ హర్షసాయి ముఖ్య అతిథిగా పాల్గొని అలరించారు. రాత్రి ఏడుగంటలకు పెద్దపురం వారిచే చిడతలు, లేడీస్ తీన్మార్, అమ్మవారి వేషాలు, బాలు రైడర్స్ వారిచే డ్యాన్స్, బేబీ డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. గని యూత్, ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

నిత్యాన్నదానానికి డివిజ వితరణ

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని వావిలివలస గ్రామంలో రాహుల్ సౌరబ్ నిత్యాన్నదాన వృద్ధులకు డివిజ ఎన్ఎస్ఐజ లక్ష్మి దైవ దర్శనం నిమిత్తం సామాజిక కార్యకర్త పాలూరు సిద్దార్థకు వితరణ అందించారు. సత్రంలో ఉన్న వృద్ధులకు తీర్థయాత్రల కోసం కాశీ, వారణాసి, అయోధ్య వెళ్లడానికి ట్రైన్ టికెట్ల నిమిత్తం రూ.20వేలు ఆదివారం అందజేశారు. వీరికి తీర్థయాత్రను తీసుకెళ్ళేందుకు సహాయత్రం అయ్యారు. అనాథ వృద్ధులకు 2,400 రోజుల నుంచి నిత్య అన్నదానం చేపడుతున్నారు. దాతలు ఇచ్చిన సహకారంతోనే దిక్కులేని పేద వృద్ధులు, వికలాంగులకు రోజువారి నిత్య అన్నదానం చేస్తున్నామని వెల్లడించారు. దాతలు ఎవరైనా ఆర్థిక సాయం చేసేవారు 9618961868 సంప్రదిస్తే పేదలకు భోజనం పెట్టే అవకాశం ఉంటుందన్నారు.

50 శాతం రాయితీతో పశువుల దాణా

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రభుత్వం పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశువుల దాణా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉందని స్థానిక పశువైద్యాధికారి హిరణ్య తెలిపారు. ఆదివారం రామభద్రపురం పశువుల ఆస్పత్రి వద్ద దాణా లోడును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీటి కోసం రైతులు భారత పశుదానా యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. 50 కేజీల పరిమాణం ఉన్న దానా పూర్తి ఖరీదు రూ.1110 కాగా సబ్సిడీ పోగా కేవలం రూ.555 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ప్రతీ రైతుకు 3 నెలలకు 450 కేజీల దానా పంపిణీ చేస్తామన్నారు. ఈ సమీకృత దానా పిల్లెట్స్‌లో పోషక విలువలతో కూడిన విటమిన్లు, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయని అత్యధిక పాల దిగుబడికి ఇది ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. రైతులు పశువుల ఆసుపత్రుల్లో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.

రూ.80వేలు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - భోగాపురం

నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

కిడ్నీ వ్యాధి గ్రస్తుడికి ఎమ్మెల్యే లోకం మాధవి ఆర్థిక సహాయం చేశారు. మండలంలో జనసేన నాయకులు రూ.80 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. మండలంలోని రామచంద్ర పేట గ్రామానికి చెందిన సమ్మంగి రమేష్ యువకుడికి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. తండ్రి సూరి తన కిడ్నీని కొడుకు రమేష్‌కు ఇచ్చేందుకు అంగీకరించారు. కిడ్నీ మార్పిడి కోసం సుమారు రూ.13 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన నాయకులు మట్ట అయ్యప్ప రెడ్డి, వందనాల రమణ, నొడగల రాము, చెల్లుబోయిన రాము, కొంగరాణ అప్పన్న తదితరులు తమ వంతు సాయంగా 80వేలు రూపాయలను అందజేశారు. ఎమ్మెల్యే లోకం మాధవి చేతుల మీదుగా సురేష్ తండ్రి సూరికి ఈ నగదును ఆదివారం అందజేశారు. నాయకులు పల్లంట్ల జగదీష్, దుక్క రమణ, సీతం రమణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో తల్లులను సన్మానిస్తున్న జెవివి సమత నాయకులు

జెవివి ఆధ్వర్యంలో 'అమ్మకు వందనం'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెవివి ఆధ్వర్యాన ఆదివారం నగరంలోని సుంకరవీధిలో అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి సమత రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, జిల్లా నాయకులు శిరీశ , శాంతి మాట్లాడుతూ తల్లి లేనిదే జన్మలేదని, ఆజన్మాంతం తల్లిని ప్రేమించాలని, విద్యార్థి దశ నుండే తల్లిని గౌరవించడం పిల్లలకు నేర్పాలని అన్నారు. నేటి సమాజంలో తల్లులను గౌరవంగా ఎలా చూడాలి అనేది కూడా పిల్లలకు నేర్పే పరిస్థితి నెలకొందన్నారు. పాత కొత్తల మేలి కలయిక ద్వారా భావి సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మూఢ నమ్మకాల వలలో పడకుండా శాస్త్ర విజ్ఞానంతో పురోగతి సాధించాలన్నది జెవివి లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు తల్లులను సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది డాక్టర్ రమేష్‌రాజు పాల్గొన్నారు.

వేపాడ: మదర్స్ డే సందర్భంగా స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ఆదివారం తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సూపర్ వైజర్ల తల్లుల గురించి వివరించారు. పిల్లల చేత తల్లులకు కాళ్లు కడిగించారు. తల్లి భారత మాతతో సమానమని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లల్ని అంగన్వాడికి పంపించాలని, బాల్య వివాహాలు చేయకూడదని, కిషోర్ బాలికలు రక్తహీనత లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: మదర్స్‌డే సందర్భంగా మండలంలోని పలు అంగన్వాడీలలో తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మవరం గ్రామంలో రెండు, మూడు అంగన్వాడి కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఉమా మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులకు పుట్టిన ప్రతి బిడ్డ వారి బాల్యం నుండి జీవించి ఉన్నంతవరకు వారిని జన్మ సార్థకం అయ్యేలా చూసుకోవాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా తల్లులకు వారి పిల్లలు కాళ్లు కడిగి నీళ్లను నెత్తి మీద జల్లుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయం చేసుకోరా?

- ప్రభుత్వ శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- ఆక్రమణల తొలగింపులో మీనమేషాలు
- ట్రాఫిక్ కష్టాల్లో నలిగిపోతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీసు, ఆర్ అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రం రామభద్రపురంలో ట్రాఫిక్ .. పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో బైపాస్ రోడ్డు నుంచి బొబ్బిలి రోడ్డు వరకు నడవడానికి పావు కిలోమీటర్ లోపు ఉన్న ఈ దూరాన్ని చేరుకోవడానికి 20 నిముషాల నుంచి అరగంట పట్టే పరిస్థితి ఉంటుంది. ఇంతటి కష్టాలకు కారణం రహదారి ఆక్రమణలే. గత పదేళ్ల నుంచి ఈ ఆక్రమణకు అడ్డుకట్టు వేసే నాధుడు కోసం ప్రజలు కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. అయితే ఇటీవల బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు దృష్టికి ట్రాఫిక్ సమస్యలు 'ప్రజాశక్తి' తేవడంతో స్పందించి స్వయంగా పరిశీలించిన వారు దుఖాన దారులతో సమావేశాలు ఏర్పాటు చేసి స్వచ్ఛందంగా తొలగించి సహకారించాలని కోరారు. లేని పక్షంలో బలవంతంగా తొలగిస్తామని తెల్చి చెప్పారు. ఇదే విషయాన్ని తహశీల్దార్ సులోచనారాణికి తెలియజేసి ముందస్తు నోటీసులు వారి శాఖద్వారా అందజేయాలని కోరారు.

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులు సమన్వయం చేసుకుని మండల కేంద్రంలో ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదు. రోడ్డుపై దుకాణాలు పెట్టడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. దీంతో రోడ్డును ఆక్రమించి దుకాణాలు నిర్మించి వారందరికీ ముందస్తు నోటీసులు ఇచ్చి వారిని ఖాళీ చేయమని రెవెన్యూ అధికారులు చెప్పాల్సి ఉన్నా నోరు మెదపడం లేదు. పోని రోడ్డును ఆక్రమించేశారు కాబట్టి దుకాణాలను తొలగించే పనిని అర్అండ్‌బి అధికారులు చేయడం లేదు. ట్రాఫిక్‌ను క్లియర్ చేయాల్సిన పోలీసులు కూడా దుకాణాల జోలికిపోవడం లేదు. దీంతో ట్రాఫిక్ కష్టాలు తీరడం లేదు. ఇప్పటికైనా మూడు శాఖల అధికారులు సమన్వయం చేసుకుని రోడ్డుపై నిర్మించిన దుకాణాలను తొలగిస్తే తప్ప ట్రాఫిక్ కష్టాలు తప్పవని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఆరంభ సూరత్వం

దుకాణ యాజమానులకు నోటీసులిచ్చి ఆక్రమణలను తొలగించాలని అనుకున్నా అది 'ఆరంభ సూరత్వం' అన్న చందంగా నేటికి జరగకపోవడంతో ప్రజల కష్టాలు షరా మామూలేగా ఉన్నాయి. మార్చి నెలలో దీనిపై పోలీసు శాఖ కసరత్తు చేసి వారం లోపు ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కిస్తాం అన్న మాట నీటిమీద రాతలా చెరిగిపోయిందని చెప్పుకుంటున్నారు. దీనిపై ఇటీవల ప్రజాశక్తి సీఐ నారాయణరావు వద్ద ప్రస్తావించగా తమ తరుపున సిద్ధంగా ఉన్నామని రెవెన్యూ శాఖ సహకారం కొరవడిందని రెండు నెలల క్రితమే నోటీసులు ఇవ్వమని అభ్యర్థించినా నేటికి ఆ శాఖ నుంచి ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. ఈ తొలగింపు చర్యలు పూర్తిగా రెవెన్యూ, ఆర్ అండ్‌బి శాఖ పని అని తాము కేవలం అల్లర్లు జరగకుండా బందోబస్తు నిర్వహించి సమస్యను శాంతి యుతంగా పరిష్కరించేలా చర్యలు చేపడతామని బదులిచ్చారు. ఇలా శాఖల మధ్య సమన్వయం కొరవడితే ప్రజల కష్టాలు ఎలా తీరుతాయని పౌరులు ప్రశ్నిస్తున్నారు.

రాజకీయ జోక్యంతోనే.?

ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతూ రాజకీయ నాయకుల్లో ఎవరైనా ఈ శాఖల్లో తలదూర్చి సమస్యను పక్కదారి పట్టించేలా చేశారేమోననే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మూడు శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతం

బైపాస్ నుంచి 3 రోడ్ల కూడలి వరకు చిన్న పిల్లలు, వృద్ధులను తీసుకొని ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో బస్సు ప్రయాణానికి నడిచి రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ కష్టాలు తీర్చాలి.

కె.అప్పలస్వామి, విశ్రాంత ఉద్యోగి, రామభద్రపురం

భయంగా ఉంది

ఆర్‌టిసి కాంప్లెక్స్, అంతర్జాతీయ కూరగాయల మార్కెట్ ఒకే దగ్గర ఉండటం, ఉదయం, సాయంత్రం నడుచుకొని ఈ దారుల్లో రావాలంటే భయంగా ఉంటుంది. స్కూల్, కాలేజీ పిల్లలు ట్రాఫిక్ కష్టాల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం ఉదాసీనంగా ఉండి వ్యాపారస్తులకు కొమ్ము కాస్తూ ఆక్రమణలు తొలగించడంలో అశ్రద్ధ చూపుతున్నారు.

ప్రవీణ్ వర్ధన్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, రామభద్రపురం

రామభద్రపురంలో ట్రాఫిక్ కష్టాలు

రెవెన్యూ సహకారం శూన్యం

రహదారి హద్దులు, కొలతలు నిర్ణయించి ఆక్రమణదారులను గుర్తించి ముందస్తు ప్రణాళిక ప్రకారం తొలగింపు చర్యలకు సిద్ధం చేయాల్సిన రెవెన్యూ శాఖ సహకారం లేకపోవడంతో ఏమీ చేయలేక పోతున్నాం. వారు తొలగింపు చర్యలకు సిద్ధం అయితే మా సిబ్బందితో సహకారాన్ని అందించి బందోబస్తు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం.

ఎస్. నారాయణరావు,బొబ్బిలి రూరల్ సీఐ

సహకారానికి సిద్ధం

ట్రాఫిక్ కష్టాలపై నిత్యం వస్తున్న కథనాలు చూస్తున్నాం. ఆక్రమణ దారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తొలగించేలా ప్రయత్నిస్తున్నాం. లేని పక్షంలో పోలీసుల సహకారంతో జెసిబిలతో తొలిగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

ఎ.సులోచనారాణి, తహశీల్దార్

ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని ముస్లిం పెద్దలు భాషా ఇంతియాజ్, అబ్దుల్ హమీద్, కో అప్షన్ సభ్యులు ఖాన్ కోరారు. ఉగ్రవాదం నివారణకు సైనికులు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో ఆదివారం స్థానిక జామియా మసీదు నుంచి మాజీ సైనికులు కార్యాలయం వరకు జాతీయ జెండాలతో ర్యాలీ చేసి మాజీ సైనికులను సన్మానించారు. పాకిస్తాన్ కాల్పుల్లో వీర మరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడిని ఖండించారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

బొబ్బిలి: విజయోత్సవ ర్యాలీ చేస్తున్న ముస్లీమ్‌లు

భారత సైన్యానికి క్రీడాభివందనాలు

శృంగవరపుకోట: దేశ ప్రజల ప్రాణాలకు తమ ప్రాణాలను అడ్డుపెట్టి పోరాటం చేస్తున్న భారత సైన్యానికి మద్దతుగా కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో కొనసాగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ క్రీడాకారులందరూ కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాల నుండి ఒనెవే ట్రాఫిక్, పెద్దవీధి, కాపువీధి మీదుగా దేవీ బొమ్మ జంక్షన్ వరకు భారత్ మాతాకీ జై అంటూ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో ప్రజలందరూ చిన్నారులతో పాటు వారు కూడా భారత్ మాతాకీ జై అంటూ నినాదంతో గొంతుకలిపారు. అనంతరం దేవిబొమ్మ జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. క్రీడాకారుల మనస్సులో దేశభక్తిని పెంపొందించే రీతిగా ఈ కార్యక్రమం నిర్వహించామని చీఫ్ కోచ్, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిని కొణదం ప్రీతి, జాతీయ స్థాయి క్రీడాకారుడు అంబటి స్వామినాయుడు, కోచ్‌లు మహమ్మద్ ఖలీలుల్లా, భరిణికాని హారిక, పంపాన మౌనిక ఇతర కోచ్ లు బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్‌కోట: ర్యాలీ చేస్తున్న క్రీడాకారులు

రైల్వే స్టేషన్లలో ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి - కొత్తవలస

పాక్, భారత్‌ల మధ్య జరుగుతున్న దాడుల నేపథ్యంలో స్థానిక సిఐ షణ్ముఖ రావు ఆదివారం తమ సిబ్బందితో కలిసి కొత్తవలస, కంటకాపల్లి రైల్వే స్టేషన్‌లలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులు, వస్తువులను పరిశీలించారు. కొత్తవలస ఆర్‌టిసి బస్టాండ్‌లో పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మన్మధరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: బ్యాగులను తనికీ చేస్తున్న పోలీసులు

అపూర్వ కలయిక

విజయనగరం టౌన్ : ఎప్పుడో 40ఏళ్ల క్రితం వారంతా కలసి చదువుకున్నారు. చాలా ఏళ్ల తరువాత ఒకచోట కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. 40 ఏళ్ల నాటి అపూర్వ కలయక తమకు మధురానుభూతిని కలిచిందని మహారాజు ఉన్నత పాఠశాల 1985-86 సంవత్సరపు 10వ తరగతి బ్యాచ్ కు చెందిన వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కొత్త అగ్రహారంలోని గోగుల రమేష్ స్వగృహంలో నాటి పూర్వ విద్యార్థులంతా కలుసుకుని తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో సెల్ ఫోన్ లకే పరిమితం అవుతున్న పరిస్థితుల్లో ఆనాటి విద్యార్థులంతా కలుసు కోవడం నాటి ముచ్చట్లు ఎంతో ఆనందాన్ని చ్చాయన్నారు. ఆనాటి రోజులు తిరిగి రావు అంటూ జ్ఞాపకాలను పంచుకున్నారు. తామంతా సంఘటితమై మరింత బలోపేతంగా సమిష్టి కృషితో సామాజిక కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు వెళ్తామని తెలిపారు. ఆనాడు గురువుల ఇచ్చిన విలువలతో కూడిన విద్య వల్ల ఇంతటి ఉన్నత స్థాయికి చేరామని అన్నారు. ఉద్యోగాలు, విధులు నిమిత్తం ఏ ప్రాంతంలో ఉన్నప్పటికీ జన్మభూమిని మర్చిపోకుండా ఏడాదిలో ఒక్కసారైనా అందరూ కలుసుకోవడం ఆవశ్యకమని అన్నారు. కార్యక్రమంలో గ్రంధి శంకర్రావు, అప్పలనరసయ్య (కోటి) ఆర్‌జెబి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యను ప్రయోగశాలగా మార్చొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

పాఠశాల విద్యను ప్రయోగశాలగా మార్చవద్దని ఎపిటిఎఫ్ అకాడమిక్ రాష్ట్ర కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్య, ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వాలకు ప్రయోగశాలలు అయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం 6 పాఠశాలల పద్ధతిని ప్రవేశపెడితే ప్రస్తుత ప్రభుత్వం 9 రకాల పాఠశాలల అమలుకు సన్నాహాలు చేస్తుందన్నారు. 9 రకాల పాఠశాలల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తి ఒక్కో పాఠశాలకు ఒక్కో రకంగా ఉందన్నారు. 6 నుండి 10 వరకు ఉండవలసిన ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వం 3,4,5 తరగతులను విలీనం చేస్తే ఈ ప్రభుత్వం 1,2 తరగతులను కూడా విలీనం చేస్తుందన్నారు. ఇలాంటి ప్రయోగాల వల్ల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర గందర గోళంలో ఉన్నారన్నారు. పై అసంబద్ధాలను విద్యాహక్కు చట్టంకు లోబడి సరిచేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యలో శాస్త్రీయమైన, స్థిరమైన విద్యా విధానాలు ఉన్నప్పుడే విద్యార్థి అబ్యాసం క్రమాభివృద్ధి చెందుతుందన్నారు. మిగులు పాఠశాల సహాయకులను ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా నియమించాలని చేస్తున్న ఆలోచన న్యాయ సమ్మతమైంది కాదన్నారు. ఈ అసంబద్ధాలను సరిచేయాలని కోరుతూ ఎపిటిఎఫ్ రాష్ట్ర స్థాయిలో ఈనెల 14న విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నాను నిర్వహించిందని, ఎపిటిఎఫ్ శ్రేణులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకుడు జోగినాయుడు, రమేష్, నాగేశ్వర రావు, దర్శనం, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీ కొని యువకుడు మృతి

ప్రజాశక్తి - బొండపల్లి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జానకీరావు

బొండపల్లి జాతీయ రహదారి పెట్రోలు బంకు సమీపంలో ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనం లారీ ఢీ కొన్న సంఘటనలో మక్కువ మండలానికి చెందిన తుమరాడ జానకీరావు (20) మృతి చెందారు. బొండపల్లి పోలీసులు అందించిన వివరాలు ప్రకారం. మక్కువ గ్రామం, శ్రీదేవి కోలనికి చెందిన తుమరాడ జానకీరావు విశాఖపట్నం నుంచి తన సొంత గ్రామం మక్కువ ద్విచక్ర వాహనంపై వస్తుండగా బొండపల్లి వద్ద లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జానకీరావు అక్కడక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎఎస్ఐ ఎల్.గోపినాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

ప్రజాశక్తి - కొత్తవలస

దేవాడ గ్రామం వద్ద త్రిబుల్ రైడింగ్ చేస్తూ, డ్రింకింగ్ చేస్తూ ఓవర్ స్పీడ్‌తో ద్విచక్ర వాహనం నడిపిన బండికరస మధు రోడ్డు దాటుతున్న గాడి తాతబాబు(65)ను బలంగా ఢీ కొట్టాడు. దీంతో ఆయన్ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలోని పోతనపల్లి గ్రామానికి చెందిన పొట్నూరు శివ అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్ ఆదివారం ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో దగ్ధమైంది. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ మంటలు ఆరకపోవడంతో వెంటనే ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారని శివ తెలిపాడు. అప్పటికే ట్రాక్టర్ కాలిపోయిందని వాపోయాడు.

అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణాల సమాచారం తెలియజేయాలని అక్రమంగా ఎవరైనా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ వి.రవికుమార్ తెలిపారు. భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోగల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో ఆదివారం అనధికార మద్యం దుకాణాలపై (బెల్ట్ షాపులపై) దాడుల్లో భాగంగా పూసపాటిరేగ మండలం చొడమ్మ అగ్రహారానికి చెందిన వ్యక్తిని 10 మద్యం బాటిల్స్‌తో అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా బెల్ట్ షాపులను నిర్వహించరాదని, ప్రోత్సహించరాదని అన్నారు. అనధికారి మద్యం దుకాణాలు తమకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, హెచ్‌సి రామారావు, కానిస్టేబుల్ మహేష్‌లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని దేవుదళ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా నిర్వహించారు. 1998 - 2003 సంవత్సరం వరకు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుకున్న 105 మంది పూర్వ విద్యార్థులు 22 సంవత్సరాల అనంతరం అపూర్వ కలయిక, విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మాట్లాడుతూ ఈ కలయిక ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, పాఠశాలలో చదువుకున్న కాలంనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులకు పాదపూజ చేసి, దుస్సాలువతో, జ్ఞాపికతో సత్కరించి ఉపాధ్యాయుల ఆశీస్సులను పొందారు. అప్పటి ఉపాధ్యాయులైన కెంబూరు అప్పలనాయుడు, కెంబూరు రామినాయుడు, మల్లేశ్వరరావు, గారాల సూర్యం, ముడి దాన ఆనందరావు, ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, హైమావతి, కెంబూరు చంద్రరావు, కెంబూరు శ్రీనివాసరావు, పాఠశాల ప్రస్తుత ప్రధాన ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనానంతరం విద్యార్థులందరూ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పూర్వ విద్యార్థులు ముల్లు శ్రీనివాసరావు, కెంబూరు శ్రీనివాసరావు, కెంబూరు రాజేష్, లక్ష్మణ శర్మ, కర్నేన తవిటి నాయుడు, కర్నేన షణ్ముఖరావు, ప్రసాద్ రావు, బాబురావు, శివకుమారి, రమాదేవి, కేంబూరు ధనలక్ష్మి, ఏర్నేన వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ విజయనగరం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 24/2023

Between:- శ్రీమతి నరెడ్ల అనసూయమ్మ వగైరాలు ......వాదులు
And:- శ్రీ బావిశెట్టి శ్రీనివాసరావు వగైరాలు ......ప్రతివాదులు

To,
D-4: గుండు కనక రత్నం, W/o ప్రసాద్ బంట్టుపల్లి గ్రామం, డెంకాడ మండలం, విజయనగరం జిల్లా.
D-5: రెడ్డిపల్లి శాంతిప్రియ, W/o వెంకటరావు, పాతవీధి భోగాపురం విజయనగరం జిల్లా.
D-6: వరుపుల షణ్ముఖరావు, S/o లేటు శంకరరావు, పాతవీధి, భోగాపురం విజయనగరం జిల్లా.

పై నెంబర్ దావాలో వాదులు సదురు దావా షెడ్యూల్ 'B' ఆస్తులకు హక్కుదారులని మిమ్మల్ని మిగతా ప్రతివాదులను తొలగించి స్వాధీనం పొందుటకు మరియు శాశ్వత ఇంజక్షన్ కోరుచూ మరియు నష్టపరిహారం కోరుచూ మరియు ఇందిలి **A,B** షెడ్యూల్ ఆస్తులకు గత ఫలసాయం నిర్ధారించి రాబట్టే నిమిత్తం మీపైని మరియు మిగతా ప్రతివాదులపైని పై నెంబర్ దావా దాఖలు చేసియున్నారు. కావున సదరు దావాలో మీకు ఆక్షేపణలు ఉన్న యెడల అందుకు సంబంధించిన యావత్తు దస్తావేజులతో హాజరయ్యి **తేదీ 04-07-2025న పగలు 10:30 గంటల సమయంనకు** పైకోర్టు వారి ఎదుట స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరై మీ వాదన దాఖలు చేసుకొని వాదించుకోవలెను. అట్లు కానీ ఎడల సదరు దావా మీ పరోక్షమందు విచారించి తీర్మానించెదురు. కావున ఇది మీకు కోర్టు వారి ఉత్తర్వులు మేరకు తెలియజేస్తూ ప్రకటించడమైనది.

తేది :12-5-2025
విజయనగరం

పోతుల రాంబాబు
వాదులు తరపున న్యాయవాది
విజయనగరం,
సెల్ 9996458999.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP 19/2023, OS 20/2020

Between:-
Jayanthi Venkataramana Murthy and anothers ......DHRs
And :-
Behara Krishna Rao (died) and others ....JDRs

Notice to

JDR No.2) Behara Chaitra Rani @ Narisipuram Chaitra Rani, W/o late Krishna Rao, D.No. 1-19-326, BC Colony, VT Agraharam, Vizianagaram.

JDR No.3) Behara Vinay Kumar, S/o late Krishna Rao, D.No.1-19-326, BC Colony, VT Agraharam, Vizianagaram.

JDR No.4) Behara Vijay Kumar, S/o late Krishna Rao, D.No.1-19-326, BC Colony, VT Agraharam, Vizianagaram.

పై నెంబరు అమలులో మీకు అనేకసార్లు నోటీసులు పంపినా తీసుకోనందున పై నెంబరు అమలు మీకు నోటీసు నిమిత్తం తే 16-6-2025దీకి వాయిదా వేసిరి. పై నెంబరు అమలులో మీకు ఆక్షేపణలున్న ఎడల **తే 16-6-2025దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పై నెంబరు అమలు మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు
J.Bheemasena Rao,
J.Vamsi Krishna Mohan,
Advocates for DHRs,
Vizianagaram
Cell: 9441053628

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P. 3/2025

Between:-
1. Sahu Sathish, S/o late Prakash, R/o Pothanapalli Village, S.Kota Mandal, Vizianagaram District.
2. Kolluri Sirisha W/o Sivaji, D/o Late Prakash, R/o Kothapalli Village, Devarapalli Mandal, Visakhapatnam District. ....Petitioners
And:
State Bank of India, Dharamavaram Branch, S.Kota Mandal, Vizianagaram District. reptd by its Branch Manager ......Respondent

Genaral Notice

ఇందలి పిటిషనర్లు పై కోర్టులో షాహు ప్రకాష్ గారి పిల్లల వారసులని Succession Certificate జారీ చేయాలని కోరుచూ పిటిషన్ దాఖలు చేశారు. ప్రకాష్ గారి పేరు పై తెలిపిన బ్యాంకులో దాచిన సొమ్ము పొందుటకు అతని వారసులని Succession Certificate కోసం దాఖలు చేసినారు. ఎవ్వరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల స్వయంగా గాని, లాయరు ద్వారా గాని పై కోర్టులో **తే 17-6-2025దీన ఉదయం 10-30 గంటలకు** హాజరై తెలపవలెను. లేనిచో వున్న ఆధారాల మేరకు పరోక్షంగా తీర్మానం జరుగునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

బై కోర్టు ఆర్డర్
పి.ధనంజయరావు
పిటిషనర్లు తరపున న్యాయవాది,
విజయనగరం, సెల్: 9440711430

నోటీసు
మహారాజశ్రీ విజయనగరం అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.220/2016 :: I.A.326/2024

Between :
గుడ్ల రామగణేష్ రెడ్డి వగైరాలు....పిటిషనర్లు/వాదులు
And :
నీలాపు ఎల్లయ్యమ్మ వగైరాలు...రెస్పాండెంట్స్/ప్రతివాదులు
To :
R3. నీలాపు రమణ S/o. లేటు సూరయ్య, దిబ్బలపాలెం గ్రామం, భోగాపురం మండలం, విజయనగరం జిల్లా.

పిటిషనర్ పై నెంబరు గల పిటిషన్‌లో కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఎన్నిసార్లు నోటీసు పంపించినను మీరు సదరు నోటీసును అందుకోనందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఈ నోటీసు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయమన్నందున, మీ పైన పిటిషనర్ గారు వేసిన పిటిషన్ లో స్వతహాగా గాని, సంపూర్ణముగా సంజాయిషీ పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తర్వులు చెప్పగూడిన ప్లీడర్ ద్వారాగా గాని సదరు పిటిషన్‌కు ప్రత్యుత్తరం చెప్పగలందులకు **తేది.16.06.2025దీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి యెదుట హాజరు కావలెను. సదరు పై నెంబరు గల పిటిషన్‌లో మీకు ఏమైనా నిక్షేపణలు ఉన్న యెడల మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరు అయి కోర్టు వారికి మనవి చేసుకోవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మాణము చేయుదురు అవి ఈ పత్రికా ప్రకటన మూలముగా తెలియజేయడం అయినది.

P. హరగోపాల్
అడ్వకేట్, విజయనగరం
Cell No.:9440721142